





పున్నమి రేయిలో..

పున్నమి వచ్చింది.. వెళ్లింది. అయితే పున్నమి నాటి వెలుగులన్నీ ఇంకా విరజిమ్ముతూనే ఉన్నాయి. చీకటి, మబ్బు తెరల మధ్య తన తేజాన్ని ప్రసరింపజేస్తున్న చందమామను చూసి తీరాల్సిందే. మంగళవారం రాత్రి కెమేరాకు చిక్కిన చిత్రం.
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

'పట్టు' దొరికేనా..

- వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక చేసేలా కేంద్రానికి కాకినాడ జిల్లా నుంచి తాజాగా ప్రతిపాదనలు
- ఎంపికైతే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెద్దాపురం పట్టుకు మహర్దశ
- కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ ద్వారా ఆన్‌లైన్ కొనుగోళ్లకు భారీ ఊతం
- అటు ఆఫ్‌లైన్ కొనుగోళ్లకూ పెద్దఎత్తున డిమాండ్ వచ్చే అవకాశం
- బెంగళూరు నుంచి వచ్చే పట్టుతో 200 మగ్గాల్లో పెద్దాపురంలో పట్టు, ధోవతీల ఉత్పత్తి
- ఏటా రూ.3 కోట్లకుపైగా వ్యాపారం.. ఉత్పత్తుల పరిశీలనకు త్వరలో జిల్లాకు కేంద్ర బృందం
- గతేడాది జాతీయ స్థాయిలో ఉప్పాడ పట్టుకు గోల్డెన్ అవార్డు రాకతో పెరిగిన వ్యాపారం

పెద్దాపురం అంటే నాణ్యతతో కూడిన పట్టు చీరలు, ధోతీల ఉత్పత్తికి పెట్టింది పేరు. బయట ప్రాంతాలకు పెద్దాపురం పట్టు అంటే ఎంత మక్కువో మాటల్లో చెప్పలేం. ఇక్కడ నేతన్నలు చేతితో నేసే పట్టు చీరలు, ధోతీలకు పెద్దఎత్తున డిమాండ్ ఉంది. ఇతర రాష్ట్రాల్లో యంత్రాల ద్వారా నేస్తుంటే, ఇక్కడ మగ్గాల ద్వారా తయారవుతున్న వస్త్రాలకు గిరాకీ ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో పెద్దాపురం పట్టును వన్ డిస్ట్రిక్-వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక చేసేలా కేంద్రానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారు. పెద్దాపురం పట్టు వస్త్రాల ప్రాముఖ్యతను వివరిస్తూ వీటిని జాతీయ స్థాయి బ్రాండ్ కింద గుర్తించాలని నివేదికలో కోరారు. ఈ క్రమంలో త్వరలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రతినిధుల బృందం ఒకటి పెద్దాపురంలో పర్యటించి పట్టు వస్త్రాలను పరిశీలించనుంది. వాస్తవానికి బెంగళూరులో నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి పట్టును తీసుకువచ్చి మగ్గాలపై ఇక్కడ సంఘాలు నేసే ఉత్పత్తులు పెద్దఎత్తున పేరుగాంచాయి. ప్రస్తుతం ఏటా రూ.3 కోట్ల వరకు పట్టు వస్త్రాల వ్యాపారం జరుగుతోంది. త్వరలో కేంద్రం పెద్దాపురం పట్టు వస్త్రాలను గుర్తిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపురావడంతోపాటు ఆన్‌లైన్ వ్యాపారాన్ని కేంద్రమే ప్రోత్సహించనుంది.



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో చిన్నచిన్న ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉంది. అయితే పెద్దగా పెట్టుబడి లేక, ప్రోత్సాహం దక్కక అనేక మంది చిన్నచిన్న వ్యాపారులు, చేనేత సంఘాలు స్థానికంగానే తమ ఉత్పత్తులు విక్రయిస్తున్నాయి. అయితే ఇటువంటి వాటికి ఊతమివ్వడానికి కేంద్రం నిర్ణయించింది. అందుకోసం వన్ నేషన్-వన్ ప్రొడక్ట్ పేరుతో దేశవ్యాప్తంగా ఇటువంటి ఉత్పత్తులను ఎంపిక చేసి ఒకే వేదికగా ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని 2018లో నిర్ణయించింది. తద్వారా స్థానిక ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా మార్కెటింగ్ కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. అందులోభాగంగా ఏటా రాష్ట్రాల నుంచి ఈ ప్రతిపాదనలను కేంద్రం స్వీకరిస్తోంది. అలా దేశవ్యాప్తంగా వచ్చే వందలాది ఎంట్రీల్లో అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి జాతీయస్థాయి గుర్తింపునిస్తుంది. రాష్ట్రాల కేటగిరీల్లో అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ విభాగాల్లో పది అవార్డులను జాతీయస్థాయిలో ఇచ్చి ఆ ఉత్పత్తులను ఎంపిక చేస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లా చేనేతశాఖ వన్ నేషన్- వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక చేయడానికి వీలుగా 2024 ఏడాదికిగాను పెద్దాపురం పట్టు ఉత్పత్తులను సిఫార్సు చేశారు. వీటిని వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక చేసేలా నివేదిక పంపించారు. వాస్తవానికి పెద్దాపురం అంటే పట్టు లుంగీలు, పట్టు చీరలు, పట్టు కండువాలకు పెట్టింది పేరు. ఇక్కడ దాదాపు 200 వరకు మగ్గాలు ఉన్నాయి ఒకరకంగా ఇక్కడ తయారయ్యే అత్యంత నాణ్యమైన పట్టు ఉత్పత్తులు మరెక్కడా దొరకవు. ఇతర ప్రాంతాల్లో యంత్రాలపైనా, ఇతర పద్ధతుల్లోనూ చేసే వస్త్రాలు దొరికినా నేతతో చేసే అత్యంత నాణ్యమైనవి మాత్రం పెద్దాపురంలోనే లభ్యమవుతాయి. ఏటా పెద్దాపురం పట్టణం, బయట మార్కెట్ కలిపి రూ.3 కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది. ఈనేపథ్యంలో పెద్దాపురం పట్టుకు జాతీయస్థాయి గుర్తింపు కోరుతూ అధికారులు తాజాగా కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. పెద్దాపురంలో పట్టు ఉత్పత్తులు విక్రయించే చేనేత సంఘాల వివరాలు, ఉత్పత్తులు ఫోటోలు, వీడియోలను పంపించారు. వీటి నాణ్యత, ప్రాముఖ్యతను గుర్తించేలా త్వరలో పెద్దాపురానికి కేంద్ర బృందం రాబోతోంది. ఒకవేళ పెద్దాపురం పట్టును కేంద్రం గుర్తిస్తే కేంద్ర పరిశ్రమల శాఖ అవార్డు ఇవ్వడంతోపాటు జాతీయస్థాయిలో వ్యాపారాలను ప్రోత్సహించేందుకు ఆన్‌లైన్‌లో వస్త్రాల అమ్మకాలను ప్రోత్సహిస్తుంది. అయితే ఎంపిక క్లిష్టమైన ప్రక్రియ అయినప్పటికీ పెద్దాపురం పట్టు మాత్రం కచ్చితంగా ఎంపికవుతుందని అధికారులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. వాస్తవానికి పెద్దాపురం ధోవతులకు పెట్టింది పేరు. అదేవిధంగా గతంలో పెద్దాపురం సిల్క్ వస్త్రాలకు కూడా ప్రసిద్ధి. ఇదివరకు ఇక్కడ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ కూడా ఉండేదని చెబుతున్నారు. అయితే నాణ్యమైన పట్టు వస్త్రాలకు పెద్దాపురం పేరొందింది. నాణ్యత విషయంలో రాజీపడకుండా వ్యయప్రయాలకోర్చి బెంగళూరు నుంచి ముడి సరుకు రప్పించుకుంటారని వ్యాపారులు చెబుతున్నారు. ఆప్కో వంటి సంస్థల ద్వారానే వీరు ప్రధానంగా మార్కెట్ చేసుకుంటారని సమాచారం. అదేవిధంగా జిల్లా నుంచి 2023 ఏడాది కింద ఉప్పాడ పట్టుకు కేంద్రం వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్ కింద గుర్తింపునిచ్చి గోల్డెన్ అవార్డు ప్రకటించింది. ఆ ఏడాది 560కిపైగా దేశవ్యాప్తంగా ఎంట్రీలు రాగా, రాష్ట్రాలకు ఇచ్చే పది అవార్డుల్లో నాన్ అగ్రికల్చర్ ఉత్పత్తి కేటగిరీలో ఉప్పాడ పట్టుకు గోల్డెన్ అవార్డు లభించింది. దీంతో అప్పటినుంచి ఉప్పాడ పట్టుకు జాతీయ స్థాయిలో మంచి పేరు లభించింది. అటు కేంద్రం గుర్తింపునివ్వడంతో అమ్మకాలు సైతం భారీగా పెరిగాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు జిల్లా పరిశీలకుల కింద వచ్చిన అనేకమంది అధికారులు ఉప్పాడ వస్త్రాలను కొనుగోలు చేసి తీసుకువెళ్లారు. ఇప్పుడు పెద్దాపురం పట్టును కూడా కేంద్రం గుర్తిస్తే ఇక్కడి ఉత్పత్తులను దేశవ్యాప్తంగా కొనుగోలు చేసేలా కేంద్రమే మార్కెటింగ్ చేస్తుంది. అంతేకాకుండా వన్ నేషన్-వన్ ప్రొడక్ట్ కింద ఎంపికైన ఉత్పత్తులకు కేంద్రం పలు పథకాల ద్వారా సదరు వ్యాపారులకు ఆర్థికంగాను, మార్కెట్‌పరంగానూ తోడ్పాటు కూడా అందిస్తుంది.



కానరాని కందిపప్పు

- రేషన్‌లో ఈసారీ పంపిణీ లేనట్టే
- వచ్చే నెలలో కందిపప్పు సరఫరా అవకాశం లేదు
- కేవలం బియ్యం, పంచదార ఇచ్చేందుకు స్టాక్ సిద్ధం
- మార్కెట్‌లో ఆకాశాన్నంటుతున్న కందిపప్పు ధరలు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు20: జిల్లాలో ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో వచ్చే నెలలో కూడా కందిపప్పు పంపిణీ చేసే అవకాశం లేదు. పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల కందిపప్పును సెప్టెంబరు నెలలో అందించలేకపోతున్నారు. కేవలం బియ్యంతోపాటు పంచదారను మాత్రమే పంపిణీకి సిద్ధం చేశారు. కాకినాడ జిల్లాలో 21 మండలాల్లో 1060 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 6,54,592 రేషన్‌కార్డుదారులు ఉన్నాయి. వీరికి సెప్టెంబరు నెలలో పంపిణీ చేసేందుకు బియ్యం 9485 మెట్రిక్ టన్నులు సిద్ధం చేశారు. అలాగే వచ్చే నెల నుంచి కొత్తగా పంచదార పంపిణీ చేయడానికి 276 టన్నులు సిద్ధం చేశారు. పంచదారను రావులపాలెం విక్టరీ బజార్ నుంచి తీసుకొస్తున్నారు. అయితే కందిపప్పును మాత్రం సిద్ధం చేయలేకపోయారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.180 నుంచి రూ.200 ధర పలుకుతోంది. కందిపప్పు కొనుగోలు చేయలేక పేద, మధ్యతరగతి వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్‌లో ఈసారి కందిపప్పు పంపిణీ చేస్తారని ఆశగా చూసిన జిల్లా వాసులకు నిరాశే ఎదురవుతోంది. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు మూడు నెలలకు సరిపోయే విధంగా కందిపప్పు సేకరణకు పౌరసరఫరాల సంస్థ ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా జూలై నెలలో టెండర్లను ఆహ్వానించింది. అయితే టెండర్ విలువ రూ.100 కోట్లు దాటడంతో చట్టప్రకారం న్యాయ సమీక్షకు వెళ్లాల్సి రావడంతో పౌరసరఫరాలశాఖ ఈ టెండర్ వివరాలను జ్యుడీషియల్ ప్రివ్యూకు పంపింది. పౌరసరఫరాల సంస్థ అధికారులు సమాధానం పంపేందుకు నెల రోజులు సమయం పడింది. దీంతో కందిపప్పు కొనుగోలుకు ఆటంకం ఏర్పడింది. దీంతో కాకినాడ జిల్లాకు కందిపప్పు సరఫరా జరగడం లేదు. వచ్చే నెలలో కందిపప్పు పంపిణీకి ఆస్కారం లేదని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వంలోనైనా కందిపప్పు రేషన్ దుకాణాల ద్వారా అందిస్తారని ఆశగా చూసిన వారికి నిరాశే ఎదురవుతోంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రేషన్‌లో నిత్యావసర సరుకులు ఇస్తామని ప్రకటించి ఒక్కొక్కటిగా కోతలు పెడుతూ వచ్చింది. దఫాదఫాలుగా పంచదార, కందిపప్పు పంపిణీను నిలిపేసింది. కేవలం బియ్యం పంపిణీకే పరిమితమైంది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ చౌకధరల దుకాణాల నుంచి ఆశించిన స్థాయిలో సబ్సిడీపై నిత్యావసర వస్తువులు పొందలేకపోయారు. అయితే కూటమి ప్రభుత్వంలోనైనా కందిపప్పు సబ్సిడీపై పొందవచ్చని ప్రజలు భావించినప్పటికీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. దాంతో సెప్టెంబరు నెలలో జిల్లాలో రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదార, రాగులు పంపిణీ చేస్తున్నట్టు సివిల్ సప్లయిస్ డీఎం బాలసరస్వతి తెలిపారు. కందిపప్పు సరఫరా కానందున వచ్చే నెలలో ఇవ్వలేమన్నారు. కందిపప్పు కోసం ఇప్పటికీ ఉన్నతాధికార్లతో సంప్రదిస్తున్నామని చెప్పారు.



ఏలేరు ఆయకట్టులో ఎండిపోయిన వరిపొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, రైతులు

సాగునీరు ఉన్నా పొలాలకు ఇవ్వలేరా

మీకు చేతకాకుంటే చెప్పండి.. మేమే నిర్వహణ చేస్తాం : ఇరిగేషన్ అధికారులపై మాజీ ఎమ్మెల్యే వర్మ ఆగ్రహం

పిఠాపురం రూరల్, ఆగస్టు20: సాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉన్నా పొలాలకు ఎందుకు ఇవ్వలేకపోతున్నారు.. పంటలు ఎండిపోతున్నా మీకు పట్టదా. మీకు చేతకాకుంటే చెప్పండి మేమే నిర్వహణ చేసుకుని పొలాలకు నీరు అందించేలా చూసుకుంటామంటూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఇరిగేషన్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పిఠాపురం మండలం బి.కొత్తూరు, జగపతిరాజపురం, గోకివాడ తదితర గ్రామాల్లో ఏలేరు నీరు అందక ఎండిపోతున్న వరి పొలాలను మంగళవారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఇరిగేషన్ ఏఈ నిర్లక్ష్యం వల్ల 150 ఎకరాల్లో వరి పంట ఎండిపోగా, మరో 200కిపైగా ఎకరాల్లో వరినాట్లు పడని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. కిర్లంపూడి సింహాద్రికాలువ, ఎగువ ప్రాంతాల్లో అనధికారికంగా అడ్డుకట్టలు వేయడం, నీటి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. కాలువల్లో ఉన్న పూడికలను తక్షణం తొలగించాలని అధికారులకు సూచించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా వేయి క్యూసెక్కుల గోదావరి జలాలను ఏలేరు ఆయకట్టుకు మళ్లిస్తున్నారని, రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉందని, అయినా నీరు ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు చేతకాకుంటే తప్పుకోవాలని, తామే సాగునీటి సరఫరా బాధ్యతలు చూసుకుంటామని స్పష్టంచేశారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పట్టిసీమ ఎస్ఈని ఇరిగేషన్ మంత్రి సస్పెండ్ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పంటపొలాలకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పొలాలకు రెండురోజుల్లో పూర్తి స్థాయిలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్మ వెంట పిఠాపురం మాజీ జడ్పీటీసీ సభ్యుడు బర్ల అప్పారావు, దొడ్డి నాగు, బెజవాడ సురేష్, నెక్కల సత్యనారాయణ, రైతులు ఉన్నారు.

సాగునీరివ్వాలని రైతుల ఆందోళన



గ్రాంటులో ఎండిపోతున్న చేలో సాగునీటికోసం నిరసన తెలుపుతున్న రైతులు

తాళ్లరేవు, ఆగస్టు20: పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు పొలాలకు సాగునీరు అందివ్వాలని ఎండిన చేలో నుంచుని రైతులు మంగళవారం నిరసన తెలిపారు. గత పది రోజులుగా సాగునీరు సరఫరా కాకపోవడంతో వరినాట్లు ఎండిపోయి చేలు బీటలు తీశాయి. పంటకాలువలో చెత్తచెదారం పేరుకుపోవడంతో కిందకు సాగునీరు పారకపోయినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. పంటకాలువలో చెత్తను తొలగించేందుకు కాంట్రాక్టరుకు టెండరు ఖరారుచేసినా కాంట్రాక్టరు కానరాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు సిబ్బంది, రైతులు పంట కాలువలో పనిచేస్తుంటే కాంట్రాక్టరు, ఇరిగేషన్ అధికారులు కుమ్మక్కై బిల్లులు పెట్టుకుంటున్నారన్నారు. సాగునీటికి చర్యలు తీసుకోవాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు కోరారు.

గురువులకు విముక్తి

- మరుగుదొడ్ల ఫొటోల భారం నుంచి ఎట్టకేలకు ఊరట
- ఇచ్చిన హామీ నెరవేర్చిన కూటమి ప్రభుత్వం
- ఫొటోల బాధ్యత సచివాలయ ఉద్యోగులకు అప్పగిస్తూ ఉత్తర్వులు
- పాఠశాల యాజమాన్య కమిటీలకు సమాన బాధ్యత
- ఫలించిన ఉపాధ్యాయుల పోరాటం



తొండంగి, ఆగస్టు 20: వృత్తి గౌరవానికి భంగకరంగా ఉన్న మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసే బాధ్యత నుంచి తమను తప్పించండి మహాప్రభో అంటూ ఉపాధ్యాయులు ఎన్నిసార్లు మొత్తుకున్నా వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. తీయాల్సిందే, అప్‌లోడ్ చేయాల్సిందేనంటూ వేధింపులకు గురిచేసింది. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని, పిల్లలకు పాఠాలు చెప్పడంకంటే ఈ పనే ఎక్కువగా ఉందని తమకు ఫొటోల బాధ నుంచి విముక్తి కలిగించాలని ఉపాధ్యాయులు చేసిన విన్నపాలను పట్టించుకోకపోవడమే కాకుండా వైసీపీ ప్రభుత్వం పనిభారాన్ని మరింత పెంచింది. అప్పటి కూటమి నేతల దృష్టికి కూడా ఉపాధ్యాయులు ఈ విషయాన్ని తీసుకు వెళ్లడంతో స్పందించిన కూటమి నేతలు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వీటి నుంచి ఉపశమనం కలిగిస్తామని హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి రావడంతో మరుగుదొడ్ల ఫొటోల అప్‌లోడ్ భారం నుంచి ఉపశమనం కలిగిస్తున్నట్టు ప్రకటించారు. ఈ బాధ్యతను ఎవరికి అప్పగిస్తారన్నదానికి తెరదించుతూ కూటమి ప్రభుత్వం సోమవారం విధివిధానాలతో కూడిన ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇకపై ప్రతిరోజు టాయిలెట్ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సిన పనిలేదు. గ్రామ వార్డు సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సోమ, గురువారాల్లో పాఠశాలను సందర్శించి టాయిలెట్ ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. యూరినల్స్, వాష్ బేసిన్, ఫ్లోరింగ్, టాయిలెట్‌ల ఫొటోలు తీసి వాటిని అప్‌లోడ్ చేయడంతోపాటు తమ రిమార్కులు జతచేయాలి. వీరితోపాటు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఇతర సభ్యులు ప్రతి బుధ, శుక్రవారాల్లో పాఠశాలను సందర్శించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. దీనికి సంబంధించి ఐఎంఎంఎస్ యాప్ లాగిన్‌ను సచివాలయ ఉద్యోగులతోపాటు పాఠశాల విద్యాకమిటీకి ఇవ్వనున్నారు. దీంతో ప్రధానోపాధ్యాయులు ఇకపై పూర్తి సమయాన్ని విద్యావిషయక అంశాలపైనే కేంద్రీకరించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఏళ్ల తరబడి టీచర్లు పెట్టుకున్న మొరను ఆలకించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

బహిరంగ చర్చకు సిద్ధం

కొండబాబుకు ద్వారంపూడి లేఖ

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు20: ఎన్నికలనంతరం ఇచ్చిన హామీలను, ప్రజాసమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాల్సిందిపోయి అందుకు విరుద్ధంగా కక్షసాధింపు చర్యలు, నిరాధారమైన ఆరోపణలతో తనపైన, వైసీపీ కేడర్‌పైన అనేక నిందలు వేస్తూ తప్పుడు కేసులు పెడుతున్నారని.. అయితే దేనికైనా బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకి బహిరంగలేఖ రాశారు. ప్రశాంతతకు మారుపేరుగా ఉండే కాకినాడలో రాజకీయ కక్షలు ప్రేరేపించే విధంగా వ్యవహరిస్తూ కాకినాడలో కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. విద్యావంతులు, మేధావులతోపాటు ఎంతో చరిత్ర కలిగిన కాకినాడ వంటి ప్రాంతంలో ఇటువంటి ధోరణి ఏమాత్రం సమర్థనీయంకాదు. ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ఎంత మాత్రం సరికాదని లేఖలో పేర్కొన్నారు.



ప్రత్తిపాడులో వరుపుల రాజా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

త్వరలో కొత్త మద్యం పాలసీ

ప్రత్తిపాడులో రాజా విగ్రహానికి నివాళులర్పించిన మంత్రి రవీంద్ర

ప్రత్తిపాడు, ఆగస్టు20: అక్టోబర్ నుంచి నూతన మద్యం పాలసీని కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకురానున్నదని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో మంగళవారం కొల్లు రవీంద్రకు స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే నివాస గృహంలో కూటమి నాయకులతో మంత్రి కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి మద్యం, ఇసుక తదితర వనరుల నుంచి రావాల్సిన ఆదాయాన్ని దోచేశారని.. గత ప్రభుత్వ పాపాలు ఇప్పటికీ ఇబ్బందులు కలిగిస్తున్నాయని, అన్ని శాఖల్లో వైసీపీ వారు చేసిన అవినీతి తవ్వుతుంటే పుట్టలుపుట్టలుగా బయటపడుతున్నాయని కొల్లు తెలిపారు. హైస్కూల్ రోడ్డు జంక్షన్ వద్ద దివంగత టీడీపీ నేత వరుపుల రాజా విగ్రహానికి మంత్రి కొల్లు, రాజా సతీమణి ఎమ్మెల్యే సత్యప్రభ, కుమారుడు సాయి తర్షిత్‌లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పార్టీ కార్యాలయం వద్ద నివాస గృహంలో రాజా చిత్రపటానికి కూడా మంత్రి, నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, పర్వత సురేష్, వెన్నా శివ, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఇతంశెట్టి భాస్కరబాబు, తమరాన సత్యనారాయణ, అమరాది వెంకట్రావు, పైలా సాంబశివరావు, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, కాపారపు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కాకినాడ నగర కమిషనర్

జిల్లావ్యాప్తంగా వసతి గృహాల పరిశీలన

- అనకాపల్లి జిల్లా ఘటన నేపథ్యంలో అధికారుల తనిఖీలు



ఆవిర్భావ వేడుకలో మాట్లాడుతున్న రామ్మోహనరావు

సమాజాభివృద్ధిలో జేఎన్టీయూకే పాత్ర కీలకం

వర్సిటీ 17వ ఆవిర్భావ వేడుకలో ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహనరావు

- ఎంవీఆర్ కృష్ణతేజకు యంగ్ అచీవర్ అవార్డు ప్రదానం
- ప్రత్యేక అతిథిగా హాజరైన కేఎస్‌పీఎల్ సీఓఓ మెర్ల మురళీధర్

జేఎన్టీయూకే, ఆగస్టు 20: కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడ పేరుతో 1946లో ఏర్పడిన జేఎన్టీయూ 2008లో యూనివర్శిటీగా మారిందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు అన్నారు. జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ వేడుకలను ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ ఆధ్వర్యతన వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఎస్సీహెచ్ఈ చైర్మన్ రామ్మోహనరావు, ప్రత్యేక అతిథిగా కేఎస్‌పీఎల్ సీవోవో మెర్ల మురళీధర్ హాజరు కాగా ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ పాల్గొనగా అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ ఈ కళాశాల ఎందరో మేధావులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను దేశానికి అందించి సమాజాభివృద్ధిలో తనదైన పాత్ర పోషించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీని మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగాను, మాదకద్రవ్యాల రహిత విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తోందన్నారు. వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ వర్శిటీ అనుబంధ కళాశాలల్లో ప్రతిరోజూ జాతీయ గీతం ఆలపించిన తర్వాతే తరగతులు ప్రారంభించేలా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంచేందుకు వర్శిటీ పరిపాలనా భవనం ముందు భారత జాతీయ జెండాతో పాటు ప్రపంచంలోని 197 దేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కల్చర్, అర్బన్ ఔట్‌రీచ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేశామన్నారు. దీనిద్వారా వర్శిటీ అనుబంధ కళాశాలల్లో తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులను దత్తత తీసుకుని వారి బాగోగులు చూసుకుంటామన్నారు. మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించి సమాజహితమైన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ఓఎస్డీ ఎంవీఆర్ కృష్ణతేజకు యంగ్ అచీవర్ అవార్డును అతిథులు ప్రదానం చేశారు. అనంతరం కృష్ణతేజ మాట్లాడుతూ జీవితంలో ఎదురైన ఓటముల ద్వారా విజయం చేరువవుతుందని, వర్శిటీలో సివిల్ సర్వీసెస్ క్లబ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వర్శిటీ, అనుబంధ కళాశాలల అధ్యాపకులకు, ప్రిన్సిపాల్స్‌కు, యాజమాన్యాలకు, క్రీడాకారులకు, విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. పూర్వపు వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్లను సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, యాజమాన్యాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణతేజకు యంగ్ అచీవర్ అవార్డు ప్రదానం చేస్తున్న రామ్మోహనరావు, ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ





ఉత్తమ ప్రతిభా కళాశాల అవార్డుతో ప్రగతి యాజమాన్యం, ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీకాంత్

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలకు ఉత్తమ ప్రతిభా ఇనిస్టిట్యూట్ అవార్డు

జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇనిస్టిట్యూట్‌గా ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఎంపికైందని చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. బెస్ట్ పెర్‌ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డును ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ మేకా సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరేష్‌లకు ఏపీఎస్సీహెచ్ఈ ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్మోహనరావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎంవీ హరినాథబాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణ, సీఈ డాక్టర్ వై.జయబాబు, డీన్ రాధికామణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీకాంత్‌కు అప్రిసియేషన్ అవార్డును ఏపీఎస్సీహెచ్ఈ ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్మోహనరావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అందజేశారు. ప్రిన్సిపాల్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, ఏవో జీవీకే వర్మ, పీఆర్వో సాయిబాబు, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ
- ఘనంగా ముగిసిన శ్రీప్రకాష్ 48వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

తుని రూరల్, ఆగస్టు 20: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడానికి కృషి చేయాలని ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ కోరారు. మంగళవారం జరిగిన శ్రీప్రకాష్ విద్యా సంస్థల 48వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేవలం విద్యే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. వేటూరి సుందరరామమూర్తి, సంగీత దర్శకుడు ఆర్‌డీ బర్మన్ పాటలను ఎంపిక చేసుకోవడం ఈ కార్యక్రమానికి ఎంతో వన్నె తెచ్చిందన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారని, నిత్య సాధన చేస్తే వీరంతా భవిష్యత్తులో మంచి గాయకులుగా రాణించగలరనడంలో అతిశయోక్తి లేదన్నారు. అనంతరం శ్రీకృష్ణ తన పాటలతో ఆహూతులను ఉర్రూతలూగించారు. మరో అతిథి, ప్రముఖ కీబోర్డు ప్లేయర్ రవిశేఖర్ కీబోర్డుపై పలు పాటలు వాయించి అలరించారు. అనంతరం అతిథులు శ్రీకృష్ణ, రవిశేఖర్‌లకు శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన 'గాతా రహే మేరా దిల్' పోటీలో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సీహెచ్ రామతులసి, ఏపీపీఎస్సీ సభ్యుడు సోనీవుడ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



'గాతా రహే మేరా దిల్' పోటీలో విజేతలతో శ్రీకృష్ణ, విజయ్‌ప్రకాష్



శ్రీకృష్ణకి జ్ఞాపిక అందజేస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

మావోయిస్టు పార్టీ సభ్యుడు లొంగుబాటు

చింతూరు, ఆగస్టు 20: డాక్టర్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు ఎదుట మావోయిస్టు పార్టీ సభ్యుడు మడివిగంగ లొంగిపోయాడు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. మడివిగంగ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ గ్రామానికి చెందినవాడు. 2018లో నాటి కుంట ఏరియా మావోయిస్టు కమాండర్ సోడి గజేంద్ర ప్రోద్బలంతో మావోయిస్టు పార్టీ సానుభూతిపరుడిగా మారాడు. అప్పటి నుంచి 2020 వరకు కుంట ఏరియాలో మిలీషియా సభ్యుడిగా వ్యవహరించాడు. అనంతరం కుంట ఏరియా కమిటీ సభ్యురాలు సోడి మంజుల నేతృత్వంలో మావోయిస్టు పార్టీలో చేరాడు. 2021 నుంచి 2023 వరకు కుంట కమిటీ దళ సదాసిగా పని చేశాడు. 2024లో పార్టీ సభ్యుడిగా పదోన్నతి పొంది కుంట ఏరియా కమిటీలో కొనసాగాడు. పార్టీ ఆదేశాల మేరకు రెండు సార్లు పోలీసులపై కాల్పుల్లో పాల్గొన్నాడు. కాలక్రమంలో మావోయిస్టు విధానాలకు విసుగు చెందడంతో పాటు ప్రభుత్వం చేపట్టిన పునరావాస విధానాలు నచ్చి చివరకు పోలీసులు ఎదుట లొంగిపోయాడు. విలేకరుల సమావేశంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండర్ హేమంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



లొంగిపోయిన మావోయిస్టు వివరాలు తెలుపుతున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

కోనసీమ జిల్లా కలెక్టర్ ఫొటోతో
వాట్సాప్ డీపీ

- గుర్తు తెలియని వ్యక్తి సందేశాలు
- స్పందించవద్దని మహేష్‌కుమార్ విజ్ఞప్తి

అమలాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఫొటోనే వాట్సాప్ డీపీగా పెట్టి సందేశాలు పంపిస్తున్న అపరిచితుడి వ్యవహారాన్ని అధికారులు గుర్తించారు. సదరు వాట్సాప్ నుంచి వచ్చే సందేశాలకు ఎవ్వరూ స్పందించవద్దని ఆయన యంత్రాంగానికి, ప్రజలకు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళ్తే... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని జిల్లాలోని అధికారులకు మెసేజ్‌లు పంపిస్తున్నారు. +94785566071 నెంబరుతో ఉన్న వాట్సాప్ ద్వారా అధికారులకు సందేశాలు అందుతున్నాయి. ఈ నెంబరును శ్రీలంక ఫోను నెంబరుగా గుర్తించారు. అయితే ఈ నెంబరు తనది కాదని, మెసేజ్‌లకు ఎవరూ స్పందించవద్దని, కాల్స్ కూడా స్వీకరించవద్దని కలెక్టర్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



ఇష్టం లేని పెళ్లి చేసుకున్నారని...

అబ్బాయి కుటుంబీకులపై అమ్మాయి తండ్రి దాడి

పి.గన్నవరం, ఆగస్టు 20: ఇష్టం లేని పెళ్లి చేసుకున్నారన్న నెపంతో యువ జంటతో పాటు వరుడు తల్లి, చెల్లెలుపై కుమార్తె తండ్రి దాడికి పాల్పడ్డ ఘటన కోడేరులంకలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన కొప్పాడి వరలక్ష్మి, ఆచంట మండలం కోడేరులంకకు చెందిన మెలా రమేష్ నాలుగు నెలలుగా ప్రేమించుకుంటున్నారు. ఇంట్లో పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఈ నెల 18న చర్చిలో వివాహం చేసుకున్నారు. మంగళవారం ఉదయం వారు పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో ఎస్ఐ బి.శివకృష్ణ ఇరుపక్షాల పెద్దలతో మాట్లాడి పంపించివేశారు. రాత్రి సమయంలో వధువు తండ్రి కొప్పాడి వెంకటరమణ వరుడి ఇంటికి వెళ్లి అప్పుడే ఒప్పంద పత్రాలు రాసుకునే పని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన యువ జంటతో పాటు వరుడి తల్లి, సోదరిలపై దాడికి పాల్పడ్డాడు. మాట్లాడే పనివుందని వారిని గదిలోకి పిలిచి తన బొడ్డులో ఉన్న చాకుతో కుమార్తె వరలక్ష్మిని బొటన వేళ్లపై, వరుడు రమేష్‌ను కుడి ఛాతీపై, తల్లి పద్మను వేళ్లపై, సోదరి ఈశ్వరిని బొటన వేలిపై గాయపరిచాడు. క్షతగాత్రులను పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పోలీసులకు సమాచారం అందించి చికిత్స చేయించారు. వధువు వరలక్ష్మి చేతి వేళ్లకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం అమలాపురం తీసుకెళ్లాలని వైద్యులు సూచించారని కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు ఆసుపత్రికి వచ్చి వివరాలు సేకరించారు. దాడి జరిగిన ప్రదేశం పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరు కావడంతో ఆ మండల పోలీసులకు ఇక్కడి పోలీసులు వివరాలు పంపనున్నట్టు తెలిసింది.



గాయాలపాలైన వధువు వరలక్ష్మి, వరుడు రమేష్



గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

జగ్గంపేట, ఆగస్టు 20: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా జగ్గంపేటలోని జేవీఆర్ కాంప్లెక్స్ దాటిన తర్వాత రాజస్థాన్ దాబా వద్ద విశాఖపట్నం వెళ్లే జాతీయ రహదారిపై పల్సర్ మోటారు సైకిలుపై వెళ్తున్న కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొంది. శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో పాటు తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడిని జగ్గంపేట పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భూ సేకరణ కార్యాలయానికి వస్తున్న రైతులు, వారిని అడ్డుకుంటున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో)

పోలవరం ప్రాజెక్టు కోసం
భూములు కోల్పోయాం

- వైసీపీ నాయకుల వల్ల నష్టపరిహారం రాలేదు
- మా భూములకు వైసీపీ నాయకులు దొంగ పట్టాలు సృష్టించారు
- అధికారులతో కుమ్మక్కై నష్టపరిహారం కాజేశారు
- పోలవరం భూసేకరణ కార్యాలయానికి తరలివచ్చి ఆందోళన చేసిన గిరిజన, గిరిజనేతర రైతులు

ధవళేశ్వరం, ఆగస్టు 20: పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో భూములు కోల్పోయిన తమకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందలేదని గిరిజన, గిరిజనేతర రైతులు మంగళవారం ఉదయం తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం భూ సేకరణ కార్యాలయానికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఫైల్స్ దగ్ధంపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో అధికారులను కలవడానికి వచ్చిన రైతులను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం అందరినీ రైతులుగా గుర్తించి కార్యాలయంలోకి అనుమతించారు. కార్యాలయంలో స్పెషల్ కలెక్టర్ సరళ వందనంను కలిసి వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ నష్టపరిహారానికి సంబంధించిన పత్రాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా స్పెషల్ కలెక్టర్ మాట్లాడుతూ భూములిచ్చిన రైతుల పత్రాలు, ఫైల్స్ భద్రంగానే ఉన్నాయని, త్వరలోనే న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం చినరమణయ్యపేట, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన గిరిజన, గిరిజనేతర రైతులు డి.శాంతమ్మ, ముళ్ళ సీతాయమ్మ, ముళ్ళ కృష్ణారెడ్డి, పాయం వీరపుదొర, మట్టా రామమూర్తి, మెహర్‌బాబు గౌడ్ తదితర భూములు కోల్పోయిన రైతులు పోలవరం కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం సమాచారంతో తమ వద్ద ఉన్న ఆధారాలతో పోలవరం కార్యాలయానికి చేరుకున్నారు. అధికారులను కలిసి తమకు న్యాయం చేయాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కోల్పోయిన భూములకు ఎకరాకు రూ.7.50 లక్షలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందన్నారు. వైసీపీ నాయకులు, సంబంధిత అధికారులు, దళారులు కుమ్మక్కై తమ భూములకు దొంగ డి-పట్టాలు సృష్టించి తమకు అందాల్సిన పరిహారం కాజేశారన్నారు. రెండు సంవత్సరాలుగా ఐటీడీఏ, పోలవరం భూ సేకరణ అధికారులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా ఇంతవరకూ న్యాయం జరగలేదని ఆవేదన చెందారు. భూములు కోల్పోయి, నష్టపరిహారం మరొకరు కాజేయడంతో మనోవేదనతో పలువురు కుటుంబ పెద్దలు మృతి చెందారని వాపోయారు. దొంగ డి-పట్టాలు సృష్టించి పరిహార సొమ్ములు కాజేసిన వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతూ అప్పటి అధికారులు తమపై బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. రాజీకి వస్తే కొంత భూమికైనా నష్టపరిహారం అందుతుందని అధికారులే బెదిరిస్తే తాము ఏమి చేయగలమన్నారు. దొంగ డి- పట్టాలు సృష్టించి సొమ్ములు కాజేసిన విషయమై తమ ఫిర్యాదులపై విచారణ పూర్తిచేసి అసలైన లబ్ధిదారులకు పరిహారం అందజేయాలని సూచించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. రెండు సంవత్సరాలుగా ఈ ఫైల్స్ విచారణ రిపోర్టులు పోలవరం భూసేకరణ కార్యాలయంలోనే ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మా భూముల నష్టపరిహారాన్ని దొంగ పట్టాలతో కాజేశారు



డి.శాంతమ్మ, గుబ్బలపాలెం

పోలవరం భూ సేకరణలో మా కుటుంబ సభ్యులకు చెందిన 21ఎకరాల 20సెంట్ల భూమి పోయింది. ఇంతవరకు పరిహారం అందలేదు. దేవీపట్నం మండలం రమణయ్యపేటకు చెందిన వైసీపీ నాయకులు దొంగ పట్టాలు తయారు చేసి అధికారులతో కలిసి మాకు రావాల్సిన నష్టపరిహారం కాజేశారు. అప్పట్నుంచీ అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఇంతవరకు న్యాయం జరగలేదు.

అధికారుల చుట్టూ తిరుగుతూ నా భర్త కన్నుమూశాడు

ముళ్ళ సీతాయమ్మ, గుబ్బలపాలెం

పోలవరం భూ సేకరణలో కోల్పోయిన భూములకు నష్టపరిహారం మాకు అందకుండా కొందరు దొంగ డి-పట్టాలతో కాజేశారు. ఆ సొమ్ముల కోసం అధికారులు చుట్టూ తిరుగుతూ బెంగతోనే నా భర్త కన్నుమూశాడు. అప్పట్నుంచీ నేను, నా కుమారుడు అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఇంత వరకు పరిహారం రాలేదు.



నష్టపరిహారం అందకపోతే ఆత్మహత్యే శరణ్యం



పాయం వీరపుదొర, గుబ్బలపాలెం

పది ఎకరాల సాగు భూమి కోల్పోయాం. నష్టపరిహారం అందలేదు. భూమినే నమ్ముకుని బతికేవాళ్లం. పరిహారం అందించాలని రెండు సంవత్సరాలుగా అధికారులు చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం.

ఐదెకరాల పరిహారం కాజేశారు

మట్టా రమణమూర్తి, చినరమణయ్యపేట

10 ఎకరాలకు నష్టపరిహారం రావాలి. దీంట్లో ఐదెకరాలకు వైసీపీ నాయకులు అధికారుల సహకారంతో దొంగ డి-పట్టాలు సృష్టించి పరిహారం కాజేశారు. వైసీపీ నాయకులతో రాజీపడితేనే మిగిలిన భూమికి నష్టపరిహారం చెల్లిస్తామని అప్పట్లో పోలవరం భూ సేకరణ కార్యాలయంలో పని చేసిన అధికారి బెదిరించారు.

వైసీపీ నాయకులు, అధికారులు చేసిన తప్పిదాలకు మేం కష్టాలు అనుభవిస్తున్నాం

మెహర్‌బాబా గౌడ్, చినరమణయ్యపేట

10 ఎకరాల భూమితో పాటు ఇల్లు కోల్పోయినందుకు నష్టపరిహారం రావాల్సి ఉంది. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు, దళారులకు అధికారులు కొమ్ముకాయడంతో నాకు రావాల్సిన నష్టపరిహారాన్ని కొందరు కాజేశారు. అప్పటి నుంచీ భూసేకరణ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. అప్పట్లో పని చేసిన భూ సేకరణ స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యకు విన్నవించాం. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సుమిత్‌కుమార్ గాంధీ మాకు న్యాయం చేయడానికి ఆయన వంతు ప్రయత్నాలు చేశారు. అయినా మాకు రావాల్సిన నష్టపరిహారం ఇంకా అందలేదు.



నష్టపరిహారం కోసం విన్నవించడానికి వచ్చిన చిన రమణయ్యపేట గ్రామ రైతులు

కాకినాడ

ఏపీఎస్పీ అదనపు కమాండెంట్‌కు పదోన్నతి

సర్పవరం జంక్షన్, ఆగస్టు 20: కాకినాడ ఏపీఎస్పీ 3వబెటాలియన్ అదనపు కమాండెంట్ ఈ సత్యసాయిప్రసాద్‌కు కమాండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమాండెంట్‌గా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం మంగళగిరి హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

మిషన్‌శక్తి అవగాహన కార్యక్రమం

జగ్గంపేట, ఆగస్టు 20: మిషన్‌శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా మిషన్ శక్తి స్కీం గురించి మహిళలకు బాలికలు జగ్గంపేటలోని శెట్టిబలిజపేట రామాలయంలో సీడీపీవో ఎం.పర్షిమి అధ్యక్షతన జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సెలర్ బి.దుర్గారాణి అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. జీఎంఎస్‌కే ఆర్.జ్యోతి, ఏఎన్ఎం కె.బాబి, ఏడబ్ల్యూడబ్ల్యూ మహిళలు పాల్గొన్నారు.

'గ్రామసభలను విజయవంతం చేయాలి'

కరప, ఆగస్టు 20: ఈనెల 23న మండల గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నామని, అధికారులు విజయవంతం చేయాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం గ్రామసభల్లో ప్రతిపాదిత కొత్త ఉపాధి పనులు, పనుల ప్రగతిని, ఖర్చుల వివరాలను తెలియజేస్తామన్నారు.

అనధికార నాన్‌లేఅవుట్లలో రాళ్ల తొలగింపు

కాకినాడరూరల్, ఆగస్టు 20: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు రూరల్ మండలం గంగనాపల్లి పంచాయతీపరిధిలోని అనధికార నాన్‌లేఅవుట్లలో అక్రమంగా ఏర్పాటు చేసిన రాళ్లను తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి గోవిందరాజులు తెలిపారు. పదెకరాలలో ఏ అనుమతులు లేకుండా నాన్‌లేఅవుట్లలో ఏర్పాటుచేసిన రాళ్లను పంచాయతీ సిబ్బంది తొలగించారన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

పిఠాపురం, ఆగస్టు 20: దేశంలో నవశకానికి నాందిపలికింది మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆయన 80వ జయంతి సందర్భంగా పట్టణంలోని ఇందిరానగర్‌లోఉన్న విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ కార్యదర్శి మేడిది శ్రీనివాసరావు, కౌన్సిలరు బోను దేవ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నంది గణేష్ పాల్గొన్నారు.

'రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం'

కాకినాడ సిటీ, ఆగస్టు 20: శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన దేశం అగ్రస్థానంలో నిలిచేలా రాజీవ్‌గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మల్లిపూడి రాంబాబు, చెక్క నూకరాజు బత్తిన లలిత పాల్గొన్నారు.

డెయిరీఫారమ్ సెంటర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు కుక్కల పోతురాజు ఆధ్వర్యం వహించగా ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తనయుడు శ్రీరాజ్ పాల్గొన్నారు,

కాకినాడ రూరల్ ఎంపీడీవోగా స్వప్న

సర్పవరం జంక్షన్, ఆగస్టు 20: కాకినాడ రూరల్ ఎంపీడీవో కర్రె స్వప్న మంగళవారం మండల కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలముందు ఇతర జిల్లాకు బదిలీపై వెళ్లారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మళ్లీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో రమేష్‌నాయుడు విశాఖ జిల్లాకు వెళ్లారు.

తునిరూరల్ ఎస్ఐగా కృష్ణామాచార్యులు

తుని రూరల్, ఆగస్టు 20: తుని రూరల్ ఎస్ఐగా ఈ.కృష్ణామాచార్యులు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రూరల్ ఎస్ఐగా ఉన్న రమేష్‌బాబు బదిలీపై వెళ్లారు. కృష్ణమాచార్యులు కోనసీమ జిల్లా డీసీఆర్‌బీనుంచి ఇక్కడకు బదిలీ కాగా ఆయన ఇటీవల తుని సర్కిల్‌లో తొండంగి పీఎస్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించారు.

'శ్రీప్రకాష్'లో రక్తదాన శిబిరం

తుని రూరల్, ఆగస్టు 20: శ్రీప్రకాష్ విద్యాసంస్థలు 48వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాసంస్థలు అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. విద్యార్థులతోపాటు సంస్థలో పనిచేసే సిబ్బంది,పలువురు రక్తదానంచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ హాజరయ్యారు. డాక్టర్ కె.సత్యనారాయణ, మదర్ బ్లడ్‌బ్యాంక్ డైరెక్టర్ డి.శివగుప్త, స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

'టీనేజర్లు మోటార్‌సైకిళ్లు నడపరాదు'

సామర్లకోట, ఆగస్టు 20: టీనేజర్లు మోటార్‌సైకిళ్లు నడపరాదని, దీనిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిలో చైతన్యం తీసుకురావాలని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా తరగారావు అన్నారు. సామర్లకోట ప్రతిభ విద్యాసంస్థల ఆవరణలో మంగళవారం డ్రగ్స్ నియంత్రణపై విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్వీవీజీ ప్రకాష్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు వి.పాండురంగారావు, ప్రిన్సిపాల్ టి.సునీత, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీగౌరి పాల్గొన్నారు.

పూడిక తొలగింపు పనుల పరిశీలన

సామర్లకోట, ఆగస్టు 20: సామర్లకోట పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో మురుగు కాలువల్లో పూడిక తొలగింపు పనులను మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు మంగళవారం పరిశీలించారు. పట్టణ టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. పట్టణంలో పెరిగిన ఆక్రమణలు తొలగించకుండా పూర్తిస్థాయిలో పూడిక తొలగింపులుఎలా సాధ్యమని పలువురు కౌన్సిలర్లు అభిప్రాయపడుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్

తొండంగి, ఆగస్టు 20: ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బైక్‌తో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వి.కృష్ణ, పి.శ్రీను మరో యువకుడితో కలిసి మోటార్‌సైకిల్‌పై కోదాడ రోడ్‌లో ఉన్న బీడు వద్దకు వెళ్తుండగా అదుపు తప్పి అక్కడ ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో కృష్ణ, శ్రీనులకు బలమైన గాయాలు కావడంతో వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

అందరూ సేవాభావం కలిగి ఉండాలి: మంత్రి కొల్లు రవీంద్ర



స్వామి దయానంద సరస్వతి సేవా ఆశ్రమ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, ఆగస్టు 20: అందరూ సేవా భావం కలిగి ఉండాలలని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఏలేశ్వరం పట్టణం చైతన్యనగర్ కాలనీలో దాతల సహాయంతో నిర్మించిన స్వామి దయానంద సరస్వతి సేవా ఆశ్రమ భవనాన్ని మంగళవారం ఆయన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా వీరికి శ్రీప్రణవాశ్రమం ప్రతినిధి శ్రీస్థైర్యానంద సరస్వతి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ దేశం మొత్తం ప్రతి జిల్లాలో స్వామి దయానంద సరస్వతి ఆశ్రమాలు నిర్మించి ఎందరో అనాధ పిల్లలకు అండగా నిలుస్తున్నారన్నారు. అనాథ పిల్లలను చేరదీసి వారికి ఉన్నత విద్యతోపాటు మంచి భవిష్యత్ అందిస్తున్నందుకు సంస్థ ప్రతినిధులను, ఆశ్రమ స్థలదాత, భవన నిర్మాణానికి కృషి చేసిన వారిని కొనియాడారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి పాల్గొన్నారు.

'మత్స్యకారులను ఆదుకుంటాం'

మత్స్యకారులను ఆదుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పట్టణంలో నెయిలపేట రామాలయంవద్ద శ్రీవెంకటేశ్వర మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా మంత్రి కొల్లు రవీంద్ర, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమం బాటలో నడిపించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అన్నారు. పోట్నూరి వీర గణపతి, గోపి, రంగారావు, వేలూరి రమణ, జనా వెంకటేశ్వరరావు, జంపా నాగేశ్వరరావు, సత్యనారాయణ, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, బుగతా శ్రీనివాస్, పెండ్ర ఎను, బెల్లాని శ్రీను, వాగు రాజేష్, పరవాడ రమేష్, సామంతుల గోపి, కోరాడ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా వసతిగృహాల పరిశీలన

» అనకాపల్లి జిల్లా ఘటన నేపథ్యంలో వసతిగృహాల్లో అధికారుల తనిఖీలు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 20: వసతిగృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణ పరిస్థితులు కల్పించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. అనకాపల్లి జిల్లా వసతిగృహంలో ఫుడ్ పాయిజన్ ఘటనలో ముగ్గురు చిన్నారులు మరణించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, పోలీసు, శిశు సంక్షేమ శాఖాధికారులు జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల సంరక్షణ గృహాలు, వసతిగృహాలు, ఆశ్రమాల్లో పరిస్థితులపై తనిఖీ చేస్తున్నారు. మంగళవారం రాత్రి నగరపాలక సంస్థ కమిషనర్ భావన, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ కాకినాడ నగరంలోని పలు వసతిగృహాలను తనిఖీ చేశారు. చిన్నారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ వెనుక ఉన్న ఓ వసతిగృహాన్ని పరిశీలించారు. సీబీఎం కాలలేజీ రోడ్డులోని కల్వరి టెంపుల్ వసతిగృహాన్ని పరిశీలించారు. భాస్కర నగర్ వాటర్ ట్యాంకర్ సమీపంలో ఉన్న పరివర్తన వసతిగృహాన్ని పరిశీలించారు.

శాంతివర్ధన మినిస్ట్రీస్, శిశు సంరక్షణ కేంద్రం తనిఖీ

పెద్దాపురం, ఆగస్టు 20: మండలంలోని పులిమేరు శాంతి వర్ధన మినిస్ట్రీస్‌ను తహశీల్దార్ వెంకటలక్ష్మి మంగళవారం పరిశీలించారు. భోజనహాలు, వంటగదులు పరిశీలించి విద్యా ర్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అనకాపల్లి ఘటన నేపథ్యంలో తనిఖీలు చేపట్టామన్నారు.

జగ్గంపేట, ఆగస్టు 20: జగ్గంపేటలోని గొల్లలగుంటలో చిందాడ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్‌లో అధికారులు తనిఖీ నిర్వహించారు. భద్రతా ప్రమాణాలు, అనుమతులు, పారిశుధ్యం, ఆహార నాణ్యత పరిశీలించారు.

సిరి మానసిక వికలాంగ పాఠశాల తనిఖీ

సామర్లకోట, ఆగస్టు 20: పట్టణంలో సిరి మానసిక విక లాంగుల పాఠశాల పరిసరాలను, హాస్టల్ నిర్వహణ తీరును పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో జి.ఉషా తదితర ఐసీ డీఎస్ సిబ్బంది మంగళవారం తనిఖీ చేశారు. హాస్టల్ విద్యా ర్థులకు పెడుతున్న ఆహార మెనూ, తరగతి గదులు, కిచెన్ షెడ్‌ను, ఆహార తయారీని క్షుణ్ణంగా పరిశీలించారు.

'బాలికలు, మహిళల భద్రతే ధ్యేయం'

కాకినాడ క్రైం, ఆగస్టు 20: బాలికలు, మహిళల రక్షణ, భద్రతే ధ్యేయంగా పోలీసుశాఖ పనిచేస్తుందని, సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆర్.రామచంద్రరావు కోరారు. గాంధీనగర్‌లో గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళలు, బాలికల రక్షణ, భద్రత, హక్కులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

'హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి'

పెద్దాపురం, ఆగస్టు 20: కోల్‌కతాలోని వైద్యురాలు హత్యాచారానికి గురవడంపై పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం నిరసన తెలియచేశారు. ఎస్‌కేబీఎం కళాశాలవద్ద ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ నేతృత్వంలో ఈ నిరసన తెలిపారు. దీనికి ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీంజనేయులు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ విజృంభణ, కార్యదర్శి కడితి సతీష్ పాల్గొన్నారు.

హత్యాచార ఘటనపై నిరసన



వైద్యులకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ క్రైం, ఆగస్టు 20: పీజీ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా కాకినాడ జీజీహెచ్‌లో డాక్టర్లు నిర్వహిస్తున్న ఆందోళన మంగళవారానికి 8వరోజుకు చేరింది. నిందితులను కఠినంగా శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సందర్శించి డాక్టర్లకు సంఘీభావం తెలిపారు. సభ్యసమాజం తలదించుకునేలా వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు.

ధర్మవరంలో ప్రగతిశీల మహిళా సంఘం కార్యకర్తల ప్రదర్శన

ప్రత్తిపాడు, ఆగస్టు 20: ధర్మవరంలో మంగళవారం అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం కార్యకర్తలు, మహిళలు ప్రదర్శన నిర్వహించారు. కోల్‌కత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనలు నిరసిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ప్రగతిశీల మహిళా సంఘం కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. మహిళలకు రక్షణ కల్పించాలని అఖిల భారత ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాకర రత్నకుమారి, అనూషలక్ష్మి డిమాండ్ చేశారు.

'వైద్యురాలిని హత్య చేసిన వ్యక్తిని ఉరితీయాలి'

తాళ్లరేవు, ఆగస్టు 20: కోల్‌కత్తాలో వైద్యురాలిని అత్యాచారం, హత్యచేసిన దుండగుడిని నడిరోడ్డు మీద ఉరితీయాలని మహిళా సంఘాల నేతలు ఆదిలక్ష్మి, ఈశ్వరీబాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయంవద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహిళలు ధర్నా చేశారు. అంగన్‌వాడీలు, యానిమేటర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'పెరటి తోట పెంపకం ఎంతో లాభదాయకం'

ప్రత్తిపాడు, ఆగస్టు 20: గ్రామాల్లో పెరటితోటల పెంపకం మహిళలకు ఎంతో లాభదాయకమని రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ వర్రే నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని గోకవరం పంచాయతీలోని మెట్టచింత గిరిజనలో జిల్లా ప్రకృతి వ్యవసాయం రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా పెరటితోటల పెంపకం అవగాహన, శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 11 రకాల విత్తనాలను మహిళారైతులకు పంపిణీ చేశారు. ఏపీ సీఎన్ఎఫ్ మెంబర్ మల్లేశ్వరి, ఎంపీటీసీ ఎ.సత్యవతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాకినాడలో పోస్టల్ పథకాలపై భారీ ర్యాలీ

కాకినాడ సిటీ, ఆగస్టు 20: ఆంధ్రప్రదేశ్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆదేశాల మేరకు ఈ నెల 21న కాకినాడలో పోస్టల్ పథకాలపై ఉదయం భారీ ర్యాలీ, డాక్ చౌపాల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ చుక్క శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ఆఫీసునుంచి అసిస్టెంట్ డైరెక్టర్ విచ్చేస్తారన్నారు.

కాకినాడలో మారథాన్ 5కే రెడ్ రన్

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 20: హెచ్ఐవీ నివారణ, ఎస్‌టీఐ, ఆర్‌టీఐపట్ల యువతకు అవగాహన కల్పించేందుకు మంగళవారం డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ, ఎయిడ్స్ (దిశ), జిల్లా స్పోర్ట్స్ అథారిటీల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ప్రభుత్వ కాలేజీ విద్యార్థులతో మారథాన్ 5కే రెడ్ రన్ కార్యక్రమం నిర్వహించారు. మారథాన్‌లో పురుషుల విభాగంలో రాణించిన కె.స్వామి(పెద్దాపురం)కి ప్రథమ బహుమతి, పి.నానిబాబు(కాకినాడ)కి ద్వితీయ బహుమతి, స్త్రీల విభాగంలో ఎస్.శిరీష(జగన్నాథపురం)కు ప్రథమ బహుమతి, ఎం.వీరావేణి(కాకినాడ)కు ద్వితీయ బహుమతి డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ అందించారు. ప్రథమ బహుమతిగా తలో రూ.7వేలు, ద్వితీయ బహుమతిగా తలో రూ.4వేలు విజేతలకు అందించారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి శ్రీనివాస్, ఎ.బుజ్జిబాబు, జిల్లా సూపర్‌వైజర్ రత్నామణి, జిల్లా లెప్రసీ, ఐసీటీసీ, డీఎస్ఆర్, షేర్ ఇండియా, ఎల్‌డబ్ల్యూఎస్, ఉమా మనో వికాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా పాలనందిస్తా: ఎమ్మెల్యే నానాజీ

కరప, ఆగస్టు 20: జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, వారి నమ్మకానికి తగ్గట్టుగా మంచి పాలనందించి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) అన్నారు. కరప మండలం నడకుదురులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం టీడీపీ సీనియర్ నాయకురాలు ఏటుకూరి నాగమణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానాజీ, టీడీపీ కాకినాడ రూరల్ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్(బాబీ)లకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్నిగ్రామాల్లో మొదటి ప్రాధాన్యతగా మౌలిక సదుపాయాలను కల్పిస్తానన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనతో రాష్ట్రం సర్వ నాశనమైందన్నారు. నానాజీ, బాబీలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కటకంశెట్టి బాబీ జన్మదినం సందర్భంగా అతడికి శుభాకాంక్షలు తెలిపి భారీ కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ కాకినాడ రూరల్ పరిశీలకుడు కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు బందారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, కర్రెడ్ల గోవిందు, బోగిరెడ్డి గంగాధర్, మట్టా ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.

'సొంత వ్యాపారాల ద్వారా ఆర్థికంగా ఎదగాలి'

పిఠాపురం, ఆగస్టు 20: ఆసక్తి ఉన్న రంగంలో సొంత వ్యాపారాలు ప్రారంభించడం ద్వారా ఆర్థికంగా ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి.హరిశేషు సూచించారు. పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్కిల్‌హబ్‌లో స్టార్ట్ యువర్ బిజినెస్‌పై మంగళవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పలు అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి శ్యామ్, కోఆర్డినేటర్ రేవతి, ఐఎల్‌వో ట్రైనర్స్ తరుణ్‌కుమార్, సత్యనారాయణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యరావు పాల్గొన్నారు.

'కాయ, రసం పీల్చే పురుగులపై అప్రమత్తంగా ఉండాలి'

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 20: పత్తిపంటలపై గులాబీరంగు కాయతొలుచు పురుగు, రసం పీల్చే పురుగులు ఆశించాయని, రైతులు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాలని ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ దయాకర్, డాక్టర్ శర్మ సూచించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, వన్నెపూడి, చెందుర్తి, దుర్గాడ తదితర గ్రామాల్లో పత్తి పంటను మంగళవారం వారు పరిశీలించారు. వీరి వెంట వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, గోవిందరాజు ఉన్నారు.

'కూటమి ప్రభుత్వంతో బ్రాహ్మణులకు మంచి రోజులు'

కాకినాడ సిటీ, ఆగస్టు 20: కూటమి ప్రభుత్వం రాకతో బ్రాహ్మణులకు మంచి రోజులు వచ్చాయని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు హోతా రవి అన్నారు. బ్రాహ్మణ సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాజీ డైరెక్టర్ పునుగుపాటి సోమసుందర్, అర్చక సంఘం అధ్యక్షుడు దివి శ్రీనివాస్, తనికెళ్ల రాంబాబు, కడియాల సత్యనారాయణ, ఇంద్రగంటి శర్మ, అప్పల రాంజీ, సంపర కృష్ణ పాల్గొన్నారు.

వినికిడి సమస్యల నివారణకు ఆడియోమెట్రిక్ మిషన్లు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 20: వినికిడి సమస్యల నివారణ కోసం ఆడియోమెట్రిక్ సేవలు ఎంతగానో దోహదపడతాయని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కాకినాడ కాపు కల్యాణ మండపంలో దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్, తోట సుబ్బారావు రూరల్ డెవలెప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ రూ.30లక్షల సీఎస్ఆర్ నిధులతో 200మంది లబ్ధిదారులకు వినికిడి మిషన్లను మంగళవారం పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతులు సమస్యల నివారణకు కృషి చేస్తున్న ఎన్ఎఫ్ఎల్ సీఎండీయు శర్వానంద్‌ను అభినందించారు. కాకినాడలో మూడు శిబిరాలు నిర్వహించి 500మందికి అవసరమైన వినికిడి మిషన్లు అందించామని సంస్థ డైరెక్టర్ తోట సర్వారాయుడు తెలిపారు. శ్రవణ ఫౌండేషన్ చైర్మన్ రేగుల రామాంజనేయులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ చెక్కా రమేష్ శ్రీనివాస్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, పెద్దిరెడ్డి, జి.సుబ్బారావు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి'

కాకినాడ సిటీ, ఆగస్టు 20: గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పూర్తిగా నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అయినా సంక్షేమ బోర్డును పునఃప్రారంభించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కాకినాడ ఏరియా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తాటిపాక మధు కోరారు. స్థానిక గ్లాస్ హౌస్‌సెంటర్ వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో లక్ష్మీగణపతి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా తాటిపాక మధు, అధ్యక్షుడిగా ఆర్.చిన్నరాజు, ఉపాధ్యక్షుడిగా టి.సాయి, ప్రధాన కార్యదర్శిగా కె.ప్రసాద్, సహాయ కార్యదర్శిగా కాశీ, కోశాధికారిగా ఆర్.చక్రితోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురికి రూ.60వేల జరిమానా

రౌతులపూడి, ఆగస్టు 20: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి రౌతులపూడి తుని సివిల్ జడ్జి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.60వేలు జరిమానా విధించినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. రౌతులపూడి వైఆర్పీ కాలువవద్ద ఎస్.పైడిపాలకు చెందిన బొంతు సతీష్ సారాయి కాస్తుండగా పట్టుకుని 30లీటర్ల సారాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. బంగారయ్యపేట గ్రామశివారు పేకాట శిబిరంపై దాడి చేసి 8మందిని పట్టుకుని రూ.11,270 నగదు సీజ్ చేశామన్నారు.

'ఉత్తమ విద్యను అందించాలి'

పిఠాపురం, ఆగస్టు 20: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన ఉత్తమవిద్యను అందించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సూచించారు. పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువు కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆయన మంగళవారం సందర్శించారు. అక్కడ విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలించి సమస్యలపై ఆరాతీశారు.

గొల్లప్రోలులో పిచ్చికుక్క స్వైరవిహారం

గొల్లప్రోలు, ఆగస్టు 20: గొల్లప్రోలులో మంగళవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేయడంతో 15మందికి గాయాలయ్యాయి. పట్టణంలోని పీహెచ్‌సీ, ఎస్సీ కాలనీ, రంగప్పచెరువు వీధి, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లపై తిరుగుతున్న వారిని పిచ్చికుక్క కరిచింది. పీహెచ్‌సీకి వచ్చిన రోగులపై దాడికి ప్రయత్నించడంతో వారు పరుగులు తీశారు. గాయపడినవారు గొల్లప్రోలు పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందారు. తీవ్రంగా గాయపడిన నలుగురిని పిఠాపురం, కాకినాడ జీజీహెచ్‌లకు చికిత్స నిమిత్తం తరలించారు.

'ఆదిత్య'లో ముగిసిన అతిథి ఉపన్యాసం

గండేపల్లి, ఆగస్టు 20: మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రానిక్ డిపార్ట్‌మెంట్ వారు దిహ్యూమన్ ఫ్యాక్టర్ ఇన్‌సైబర్ సెక్యూరిటీ అనేఅంశంపై అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రమేష్ తెలిపారు. అతిథిగా పాల్గొన్న శ్రీచైతన్య ఇంటర్నెట్ యుగంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరమన్నారు. డాక్టర్ కృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రీతి, ప్రొఫెసర్ రమావసంత పాల్గొన్నారు.

'హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం'

గండేపల్లి, ఆగస్టు 20: ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. రంగంపేట మండలం సుభద్రపేటలో ర్యాలీ నిర్వహించారు. రహదారి భద్రత ప్రమాణాన్ని ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో చేయించారు. కోఆర్డినేటర్ ప్రశాంతి, శేషసాయి దుర్గ పాల్గొన్నారు.

అపర్ణాదేవికి యాపిల్స్‌తో అలంకారం

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 20: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి శ్రావణ మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అపర్ణాదేవికి కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు జరిగాయి. అపర్ణా అమ్మవారిని యాపిల్స్, కదంబపుష్పాలు, ఇతర పువ్వులతో అలంకరించారు. ఆలయ అర్చకుడు ప్రభాకరశాస్త్రి పూజలు నిర్వహించగా కమిటీసభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హెచ్ఐవీ నియంత్రణపై అవగాహన

జగ్గంపేట, ఆగస్టు 20: జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్ఐవీ నియంత్రణపై అవగాహన కల్పించే 'మీకు తెలుసా' కార్యక్రమాన్ని స్వరాజ్య అభ్యుదయసేవా సమితి సాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గవర్నమెంట్ కళాశాల ఉపాధ్యాయులు మేనేజర్ వి.రాజేష్, ఏఎన్ఎం సత్యవతి, అవుట్‌రీచ్ వర్కర్స్ శేషారత్నం, అనిల్, మణి, కృప పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి'

జగ్గంపేట, ఆగస్టు 20: జగ్గంపేట ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని వందన యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయ అధికారి పులి ప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ ప్లాస్టిక్ వినియోగంవల్ల నష్టాలను వివరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఏవీవీ ప్రసాద్, వెలుగు ఏపీఎం జగదీశ్వరి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప, ఆగస్టు 20: గుర్తుతెలియని విషపురుగు కుట్టి ఒక వ్యక్తి మృతి చెందాడు. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప మండలం అరట్లకట్ట గ్రామానికి చెందిన ఏడిద శేషగిరిరావు(55) పదిరోజుల క్రితం ఇంట్లోపడుకుని ఉండగా కాలిపై ఒక విషపురుగు కుట్టింది. ఆస్పత్రిలో చికిత్సపొంది ఇంటికి వచ్చిన అతడికి ఈనెల 14న ఫిట్స్ వచ్చాయి. దీంతో కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్సపొందుతూ ఈనెల 19న మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

జాతీయ సైంటిఫిక్ దినోత్సవం

పెద్దాపురం, ఆగస్టు 20: బాలికల పాఠశాలలో జాతీయ సైంటిఫిక్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏపీటీ సైన్స్ సెంటర్, పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 200మంది విద్యార్థులకు సైంటిఫిక్ టెంపర్, మెథడ్, లిటరసీ, పర్సెప్షన్, హ్యాబిట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఫిజియోథెరపీ కేంద్రం పరిశీలన

పెద్దాపురం, ఆగస్టు20: మహాత్మాగాంధీపాఠశాలలో భవిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కేంద్రాన్ని ఎంఈవో వీఆర్‌కే చౌదరి మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

కాశీఅన్నపూర్ణ సత్రం అదనపు కార్యదర్శిగా పేరూరి గాంధీ

అన్నవరం, ఆగస్టు 20: షిర్డీ, కాశీ, తిరుపతి, హరిద్వార్, శ్రీశైలం పుణ్యక్షేత్రాల్లోని కాశీఅన్నపూర్ణ సత్రం అదనపు కార్యదర్శిగా అన్నవరానికి చెందిన పేరూరి గాంధీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంనుంచి అదనపు కార్యదర్శిగా ఆయన ఒక్కరే నియమితులవడంతో పలువురు అభినందించారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వో బురదకోట సందర్శన

ప్రత్తిపాడు, ఆగస్టు 20: ప్రత్తిపాడు మండలంలోని ఎత్తయిన కొండలపైన ఉన్న బురదకోటను జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సరిత మంగళవారం సందర్శించారు. పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలైన బురదకోట, కె.మిర్తివాడ, బాపన్నదొర, ధారపల్లిల్లో ఆమె పర్యటించారు. గిరిజనగూడెంలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి బాలల ఆరోగ్యంపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.యశశ్వి పాల్గొన్నారు.

దోమల రహిత సమాజం కోసం కృషి చేయాలి: డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 20: పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణతో ఆరోగ్యంగా జీవించవచ్చని, దోమల రహిత సమాజం కోసం ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ కోరారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం కాకినాడ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నిర్మూలన కోసం దోమ రహిత సమాజం-ఆరోగ్యానికి సోపానం అనే నినాదంతో జిల్లావ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల పరిధిలో ప్రజలను చైతన్యం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు, బోధకాలు వంటి వ్యాధులు సంభవిస్తాయని మలేరియా అధికారి భాస్కరరావు తెలిపారు. మెక్లారిన్ స్కూల్‌లో జరిగిన దోమల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకరరావు, డీఐవో డాక్టర్ శ్రీనివాస నాయక్, డాక్టర్ విల్సన్ పాల్గొన్నారు.

పిఠాపురం, ఆగస్టు 20: దోమల వ్యాప్తిని నియంత్రించడం ద్వారా రోగాలు ప్రబలకుండా చూడవచ్చునని ఇందిరానగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ జయరాం సూచించారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా దోమల నియంత్రణపై పిఠాపురం పట్టణంలోని మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్టాఫ్ నర్స్ ఆర్.చిన్నారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, ఆగస్టు 20: మండలంలోని రాచపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్ఆర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమల వల్ల వచ్చే మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీత, సబ్‌యూనిట్ అధికారి ఆనంద్, సిబ్బంది వీరన్న పాల్గొన్నారు.

పెద్దాపురం, ఆగస్టు 20: పట్టణంలో దోమల నియంత్రణకు మురుగునీరు నిల్వఉండే ప్రాంతాలు, డ్రైనేజీల్లో గంబూసియా చేపలు విడిచిపెడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ పద్మావతి తెలిపారు. చెరువులు, మురుగునీటి డ్రైనేజీల్లో మంగళవారం ఆమె గంబూసియా చేపలను విడిచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.దావీదురాజు పాల్గొన్నారు.

తొండంగి, ఆగస్టు 20: ప్రతిఒక్కరూ దోమల నివారణ చర్యలు చేపట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఏవీనగరం వైద్యాధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. గ్రామంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు దోమల వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్యకేంద్రం పరిధిలోని అన్నిగ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. డాక్టర్ భారతి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్‌కు పూర్తి మద్దతు'

జగ్గంపేట, ఆగస్టు 20: వర్గీకరణ వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు నిరసనగా చేపడుతున్న బంద్‌కు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించిందని ఆ పార్టీ నేత సాదే నరేంద్రబాబు తెలిపారు.

బీఎస్పీ కేడర్ రిపబ్లికన్ పార్టీఆఫ్ ఇండియా పార్టీ శ్రేణులు, మాలమహానాడు నేతలు బుధవారం జరిగే భారత్ బంద్‌లో పాల్గొనాలని ఆ పార్టీ జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు అన్నారు.

'నేటి భారత్ బంద్‌కు సహకరించాలి'

కరప, ఆగస్టు 20: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం తలపెట్టిన భారత్ బంద్‌కు సహకరించాలని మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కరపలో మంగళవారం ఎస్సీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ నాయకులు సవిలే రాజేష్, మాతా అప్పారావు పాల్గొన్నారు.

'భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి'

తాళ్లరేవు, ఆగస్టు 20: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు, దళిత సంఘాల పిలుపు మేరకు చేస్తున్న భారత్ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత నేత కాశీ లక్ష్మణస్వామి పిలుపునిచ్చారు. తాళ్లరేవు మండలంలో ఇంజరం నుంచి చొల్లంగి వరకు దళిత నేతలు మంగళవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. వ్యాపార, వర్తక, ప్ర భుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆటోయూనియన్లు, ప్రజాసంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాలు బంద్‌కు సహకరించాలని కోరారు. దళితనేతలు దడాల బుజ్జిబాబు, జక్కుల ప్రసాద్ బాబు, గంటా రమేష్, మోర్త భైరవమూర్తి పాల్గొన్నారు.